హైదరాబాద్‌లో పీబీపార్టనర్స్ ఆఫీస్

హైదరాబాద్, ఆగస్టు 30: పాలసీ బజార్ ఇన్సూరెన్స్ బ్రోకర్‌కు చెందిన పీబీపార్టనర్స్..తెలంగాణ మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం వచ్చే రెండు నెలల్లో హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని ప్రారంభించడంతో పాటు కస్టమర్ కేర్ సెంటర్‌ను నెలకొల్పనున్నట్లు పీబీపార్టనర్స్ అసోసియేట్ డైరెక్టర్, సేల్స్ హెడ్ అమిత్ భదోరియా తెలిపారు. వ్యాపార విస్తరణలో భాగంగా వచ్చే రెండేండ్లలో వరంగల్, కరీంనగర్‌తోపాటు వైజాగ్, తిరుపతి, కోయంబత్తూరులలో కార్యాలయాలను తెరువాలనుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తెలంగాణలో 5,500కి పైగా ఎజెంట్లు ఉన్నారని, వచ్చే రెండేండ్లలో ఈ సంఖ్యను రెండింతలు పెంచుకోనున్నట్లు ప్రకటించారు. దేశవ్యాప్తంగా కోటికి పైగా వాహన పాలసీలు విక్రయించినట్లు, దీంట్లో తెలంగాణలో 3 లక్షలు, ఏపీలో 3.5 లక్షలు ఉన్నాయన్నారు.

విస్తారా కనుమరుగు

న్యూఢిల్లీ, ఆగస్టు 30: చౌక విమానయాన సంస్థ విస్తారా ఎయిర్‌లైన్స్ ఇక కనుమరుగుకాబోతున్నది. విస్తారా బ్రాండ్‌తో నవంబర్ 11న తన చివరి విమాన సర్వీసును నడుపబోతున్నది. టాటా గ్రూపునకు చెందిన ఎయిర్ ఇండియాలో నవంబర్ 12 నుంచి విలీనం కానుండటంతో తన బ్రాండ్ సేవలు నిలిచిపోనున్నాయని తాజాగా వెల్లడించింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇక ఎయిర్ ఇండియా-విస్తారా విలీనం కాబోతున్నాయి. టాటా గ్రూపు, సింగపూర్ ఎయిర్‌లైన్స్ సంయుక్తంగా గతంలో విస్తారా ఎయిర్‌లైన్స్‌ను ఏర్పాటు చేశాయి. ఆ తర్వాతి క్రమంలో ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాను టాటా గ్రూపు కొనుగోలు చేయడంతో తన అనుబంధ విమానయాన సంస్థలను ఒక్కతాటిపైకి తేవడానికి ప్రయత్నిస్తున్నది. విలీనం తర్వాత ఎయిర్ ఇండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 25.1 శాతం వాటా కలిగివుండనున్నది. ఇప్పటికే ఇరు సంస్థలు విమానాలకు సంబంధించి లావాదేవీలు కలిసి నిర్వహిస్తున్నాయని, ముఖ్యంగా ఉద్యోగులు కలిసి పని చేస్తున్నారని ఎయిర్ ఇండియా సీఈవో, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ తెలిపారు.

జీడీపీ డౌన్.. ఇన్‌ఫ్రా స్లో

తొలి త్రైమాసికంలో 15 నెలల కనిష్టానికి వృద్ధిరేటు

- ఈ ఏప్రిల్-జూన్‌లో 6.7 శాతానికే పరిమితం
- జూలైలో 6.1 శాతానికి మందగించిన కీలక రంగాల పనితీరు
- తాజాగా విడుదలైన కేంద్రప్రభుత్వ గణాంకాల్లో తేటతెల్లం

న్యూఢిల్లీ, ఆగస్టు 30: దేశ ఆర్థిక వ్యవస్థను నిస్తేజం ఆవరించింది. ఓవైపు వృద్ధిరేటు.. మరోవైపు కీలక రంగాల పనితీరు మందగించాయి. శుక్రవారం విడుదలైన కేంద్ర ప్రభుత్వ గణాంకాల్లో ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో దేశ జీడీపీ 15 నెలల కనిష్టానికి దిగజారినట్టు తేలింది. అలాగే జూలై నెలకుగాను 8 కీలక రంగాల్లో వృద్ధిరేటు 6.1 శాతానికే పరిమితమైనట్టు స్పష్టమైంది.

వ్యవసాయ, సేవా రంగాలు డీలా

వ్యవసాయ, సేవల రంగాల ప్రదర్శన పేలవంగా ఉండటమే ఈ ఏప్రిల్-జూన్‌లో దేశ జీడీపీ వృద్ధిరేటు 5 త్రైమాసికాల కనిష్టాన్ని తాకుతూ 6.7 శాతానికే పరిమితం కావాల్సి వచ్చిందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) పేర్కొన్నది. 2023 జనవరి-మార్చిలో దేశ జీడీపీ వృద్ధిరేటు 6.2 శాతంగా నమోదైంది. మళ్లీ ఆ స్థాయి దరిదాపుల్లోకి ఇప్పుడే గణాంకాలు వెళ్లాయి. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఏప్రిల్-జూన్‌లో 8.2 శాతంగా ఉండటం గమనార్హం. ఈ ఏడాది జనవరి-మార్చిలోనూ 7.8 శాతం వృద్ధి కనిపించింది. దీంతో 3 నెలల్లో జీడీపీ 1 శాతానికిపైగా పడిపోయినట్టైంది.

ఆయా రంగాలవారీగా..

ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వ్యవసాయ రంగ జీవీఏ (గ్రాస్ వాల్యూ ఆడెడ్) 3.7 శాతం నుంచి 2 శాతానికి క్షీణించినట్టు ఎన్ఎస్ఓ తెలియజేసింది. అలాగే ఆర్థిక, నిర్మాణ, ప్రొఫెషనల్ సర్వీసెస్ జీవీఏ కూడా నిరుడు ఏప్రిల్-జూన్‌తో పోల్చితే 12.6 శాతం నుంచి 7.1 శాతానికి దిగజారింది. ట్రేడ్, హోటల్స్, రవాణా, కమ్యూనికేషన్ అండ్ సర్వీసెస్ విభాగాల్లోనూ వృద్ధి 9.7 శాతం నుంచి 5.7 శాతానికి పతనమైంది. ఈ క్రమంలోనే ప్రధానమైన తయారీ రంగ జీవీఏ 2 శాతం పెరిగి 7 శాతానికి పుంజుకున్నా.. మైనింగ్-క్వారీయింగ్, విద్యుత్తు, గ్యాస్, నీటి సరఫరా ఇతర యుటిలిటీ సర్వీసుల్లో ఆకర్షణీయ వృద్ధి ఉన్నా ఫలితం లేకపోయింది. ఇదిలావుంటే ప్రస్తుత ధరల వద్ద ఈసారి జీడీపీ విలువ రూ.77.31 లక్షల కోట్లుగా ఉన్నట్టు ఓ ప్రకటనలో ఎన్ఎస్ఓ తెలిపింది.

మౌలికం బేజారు

దేశ పారిశ్రామిక ప్రగతికి ప్రామాణికంగా భావించే 8 కీలక రంగాల్లో మందగమనం అలుముకున్నది. గత నెల జూలైలో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు రంగాల్లోని ఉత్పాదకతలో వృద్ధిరేటు 6.1 శాతంగానే ఉన్నది. నిరుడు జూలైలో ఇది 8.5 శాతంగా ఉండటం గమనార్హం. భారతీయ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఈ 8 రంగాల వాటా 40.27 శాతంగా ఉండటం విశేషం. అలాంటిదిప్పుడు ఆయా రంగాల్లో ఉత్పత్తి ఏడాది కాలంలో 2.4 శాతం మేరకు పడిపోయింది. ముడి చమురు ఉత్పత్తి మైనస్ 2.9 శాతంగా, సహజ వాయువు ఉత్పత్తి మైనస్ 1.3 శాతంగా ఉండటం దెబ్బ తీసిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే బొగ్గు, ఉక్కు, సిమెంట్, విద్యుత్తు రంగాల్లోనూ ఉత్పాదకత గతంతో పోల్చితే వరుసగా 6.8 శాతం, 7.2 శాతం, 5.5 శాతం, 7 శాతాలకు పడిపోయింది. దీంతో రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువుల రంగాల్లో 6.6 శాతం, 5.3 శాతం చొప్పున వృద్ధి నమోదైనా ప్రయోజనం లేకపోయింది.

గూగుల్ పేలో కొత్త ఫీచర్లు

- యూపీఐ సర్కిల్ పరిచయం
- ఈరూపీ వోచర్ల జారీ,
- ట్యాప్‌అండ్‌పే పేమెంట్లూ షురూ

న్యూఢిల్లీ, ఆగస్టు 30: ప్రముఖ పేమెంట్స్ యాప్ గూగుల్ పేలో కొత్త ఫీచర్లను తీసుకొచ్చారు. ఇందులో భాగంగానే శుక్రవారం యూపీఐ సర్కిల్‌సహా మరికొన్నింటిని పరిచయం చేశారు. ముంబైలో 3 రోజులపాటు జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ (జీఎఫ్ఎఫ్) 2024 ముగింపు సందర్భంగా ఈ మేరకు గూగుల్ పే నుంచి ప్రకటనలు వచ్చాయి. కాగా, యూపీఐ సర్కిల్‌తో గూగుల్ పే వినియోగదారులు (ప్రైమరీ యూజర్లు) తమ కుటుంబ సభ్యులు, స్నేహితులను సెకండరీ యూజర్లుగా అనుమతించవచ్చు. దీంతో తమ బ్యాంక్ ఖాతాను లింక్ చేసుకోకుండానే ఇకపై వీరంతా కూడా ప్రైమరీ యూజర్ అకౌంట్ ద్వారానే డిజిటల్ చెల్లింపులను జరుపుకోవచ్చు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) భాగస్వామ్యంతో దీన్ని తీసుకొచ్చింది. అలాగే ఈ సందర్భంగా యూపీఐ వోచర్స్ (ఈరూపీ)నూ గూగుల్ పే ప్రారంభించింది. ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలతోపాటు ప్రస్తుత యూపీఐ వినియోగదారులు వీటిని జారీ చేయవచ్చు. అంతేగాక రూపే కార్డుల కోసం ట్యాప్‌అండ్‌పే చెల్లింపుల సౌకర్యాన్నీ కల్పించింది. ఈ పేమెంట్స్ కోసం రూపే కార్డుదారులు తమ మొబైల్ ఫోన్లను కార్డులతో అనుసంధానించుకోవాల్సి ఉంటుంది. యూపీఐ లైట్ కోసం ఆటోపే ఆప్షన్, యాప్‌పై క్లిక్‌పే క్యూఆర్ కోసం సపోర్ట్‌నూ అందిస్తున్నది. కాగా, ఆర్థిక వ్యవస్థలో డిజిటలైజేషన్‌ను మరింత విస్తృతపర్చడానికి ఈ నెలలో జరిగిన ద్రవ్యసమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తీసుకున్న నిర్ణయాలు, ఇచ్చిన అనుమతుల మేరకే ఈ ఫీచర్లు అందుబాటులోకి వచ్చాయి.

బ్రోకర్లపై సెబీ కొరడా

46 స్టాక్, కమోడిటీ బ్రోకరేజీల రిజిస్ట్రేషన్లు రద్దు

న్యూఢిల్లీ, ఆగస్టు 30: క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. 46 స్టాక్, కమోడిటీ బ్రోకరేజీ సంస్థలపై కొరడా ఝుళిపించింది. నిబంధనల మేరకు లేని 39 స్టాక్ బ్రోకర్లు, 7 కమోడిటీ బ్రోకర్ల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను శుక్రవారం రద్దు చేసింది. అలాగే 22 డిపాజిటరీ పార్టిసిపెంట్స్ రిజిస్ట్రేషన్లనూ క్యాన్సిల్ చేస్తూ నిర్ణయం తీసుకున్నది. రిజిస్ట్రేషన్లు రద్దైనా.. స్టాక్ లేదా కమోడిటీ బ్రోకర్లుగా, డిపాజిటరీ పార్టిసిపెంట్లుగా గతంలో తీసుకున్న చర్యలకు, వైఫల్యాలకు ఇకపైనా వారు బాధ్యులేనని వేర్వేరుగా ఇచ్చిన తాజా ఆదేశాల్లో సెబీ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే సెబీకి బాకీపడిన వడ్డీలు, ఫీజులు, ఇతరత్రా బకాయిలను చెల్లించాల్సిందేనన్నది.

ఆర్థికాభివృద్ధిలో విదేశీ వాణిజ్యం కీలకం

ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ డీజీ శశాంక్ గోయల్

హైదరాబాద్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ): ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో విదేశీ వాణిజ్యం, పెట్టుబడులు కీలకపాత్ర పోషిస్తాయని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి (ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ) కేంద్రం డైరెక్టర్ జనరల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ శశాంక్ గోయల్ చెప్పారు. విదేశీ వాణిజ్యం కేవలం జీడీపీని మాత్రమే కాదు.. ఉద్యోగావకాశాలు, వేతనాలను కూడా పెంచుతుందని పేర్కొన్నారు. భారత విదేశాంగ మంత్రిత్వశాఖ ఐటెక్ విభాగం సహకారంతో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈజిప్ట్ వాణిజ్య దౌత్యవేత్తల శిక్షణా కోర్సు శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోయల్ మాట్లాడుతూ.. ఈజిప్ట్, భారత్ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు చారిత్రాత్మకంగా ఉన్నాయని గుర్తుచేశారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఈజిప్ట్ వాణిజ్య దౌత్యవేత్తలకు, వారి దేశాభివృద్ధికి దోహదపడేందుకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను అందిస్తాయని చెప్పారు. అనంతరం ఈజిప్ట్ వాణిజ్య దౌత్యవేత్తలకు కోర్సు పూర్తి సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ డాక్టర్ మాధవి రవులపాటి, ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.

10 లక్షల కోట్లు పెరిగిన సంపద

స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీతో మదుపర్లలో ఖుషి



ముంబై, ఆగస్టు 30: దేశీయ స్టాక్ మార్కెట్ల రికార్డుల పరంపర కొనసాగుతున్నది. రోజుకొక చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్న సూచీలు శుక్రవారం మరో మైలురాయికి చేరుకున్నాయి. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల జోరు కొనసాగుతుండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడం, వచ్చే నెలలో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఫలితంగా ఇంట్రాడేలో 500 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 231.16 పాయింట్లు లాభపడి చారిత్రక గరిష్ఠ స్థాయి 82,365.77 వద్ద ముగిసింది. వారాంతం ట్రేడింగ్‌లో 2,228 సూచీలు లాభపడగా, 1,701 సూచీలు నష్టపోయాయి. మరో సూచీ నిఫ్టీ సైతం ఉన్నత శిఖరానికి చేరుకున్నది. వరుసగా 12 రోజులుగా పెరుగుతూ వచ్చిన నిఫ్టీ శుక్రవారం సైతం 83.95 పాయింట్లు ఎగబాకి 25,235.90 పాయింట్ల వద్ద ముగిసింది. దీంతో స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీతో మదుపరుల సంపద రూ.10 లక్షల కోట్లు పెరిగింది. గత తొమ్మిది సెషన్లలో సెన్సెక్స్ 1,941 పాయింట్లు లాభపడటంతో బీఎస్‌ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ విలువ రూ.10,00,028 కోట్లు పెరిగి రూ. 4,64,39,993.77 కోట్లు (5.54 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. వచ్చే నెలలోనే ఫెడ్ వడ్డీరేట్లను తగ్గించనుండటంతో గ్లోబల్ మార్కెట్లు ఉవ్వెత్తున ఎగిశాయి..దీంతో దేశీయ సూచీలు కూడా పరుగులు పెట్టాయని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

- మొత్తంమీద ఈ వారంలో సెన్సెక్స్ 1,279.56 పాయింట్లు(1.57 శాతం), నిఫ్టీ 412.75 పాయింట్లు(1.66 శాతం) లాభపడ్డాయి. గత తొమ్మిది రోజుల్లో సెన్సెక్స్ 1,941(2.41 శాతం), నిఫ్టీ 1,097 పాయింట్లు(4.54 శాతం) చొప్పున పెరిగాయి.
- వారాంతం ట్రేడింగ్‌లో బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా, ఎన్‌టీపీసీ, ఎయిర్‌టెల్, సన్ ఫార్మా షేర్లు ఒక్క శాతానికి పైగా లాభపడ్డాయి. దీంతోపాటు టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎల్‌అండ్‌టీ, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్, కొటక్ బ్యాంక్, ఎస్బీఐ, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, నెస్లెలు లాభాల్లో ముగిశాయి.
- కానీ, టాటా మోటర్స్, రిలయన్స్, టెక్ మహీంద్రా, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతిలు నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే రియల్టీ 1.88 శాతం బలపడగా, హెల్త్‌కేర్ 1.41 శాతం, యుటిలిటీస్, కమోడిటీస్, టెక్, సేవల రంగ షేర్లు కదంతొక్కాయి.

ఏజెన్సీకి డీసీహెచ్ఎస్ కార్యాలయం

ములుగు, ఆగస్టు30 (నమస్తే తెలంగాణ): ములుగు ప్రభుత్వ దవాఖానలో కొనసాగుతున్న వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలోని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పటల్స్ సర్వీసెస్(డీసీహెచ్ఎస్) కార్యాలయం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతానికి తరలనుంది. ప్రస్తుతం వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో ములుగు జిల్లాలో ములుగు, ఏటూరునాగారం, వెంకటాపురం(నూగూరు) సామాజిక వైద్యశాలలు కొనసాగుతున్నాయి. ఈ మూడు దవాఖానాలు డీసీహెచ్ఎస్ పర్యవేక్షణలో ఉన్నాయి. డీసీహెచ్ఎస్‌గా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్ విధులు నిర్వర్తిస్తున్నారు. ములుగు ప్రభుత్వ దవాఖాన ప్రస్తుతం ములుగులో ఏర్పాటు అయిన మెడికల్ కాలేజీకి అనుబంధంగా మారి డీఎంఈ పరిధిలోకి వెళ్లింది. దీంతో డీసీహెచ్ఎస్‌ను ఏటూరునాగారం కాని, వెంకటాపురం(నూగూరు) కాని తరలించాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు తెలిసింది. దీంతో వైద్యాధికారులు ఈ రెండు ప్రాంతాల్లో కార్యాలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. ఆయన ఆదేశాలతో త్వరలో ఏజెన్సీ ప్రాంతానికి డీసీహెచ్ఎస్ కార్యాలయం తరలివెళ్లనున్నట్లు సమాచారం.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

ములుగురూరల్, ఆగస్టు 30 : ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని బరిగలానిపల్లి గ్రామంలో గురువారం అర్ధరాత్రి జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బరిగల సురేందర్‌కు చెందిన ఇంట్లో అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయి. గమనించిన ఇంట్లో ఉన్న వారు బయటకు వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా అదుపు కాలేదు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చేలోపే ఇల్లు పూర్తిగా కాలిపోయిందని తెలిపారు. ఈ ప్రమాదంలో బాధితుడికి సుమారు రూ.10లక్షల ఆస్తినష్టం జరిగిందని, ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అడవి దున్న ఢీకొని ఇద్దరికి గాయాలు

గోవిందరావుపేట, ఆగస్టు 30 : అడవి దున్న ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని మచ్చాపూర్ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగింది. బాధితులు పోరండ్ల అంతర్యామి, పోరండ్ల వెంకటరామయ్య కథనం ప్రకారం.. వెంకటాపురం(నూగూరు) గ్రామానికి చెందిన తాము ద్విచక్ర వాహనంపై ఉదయం ములుగుకు వచ్చి సాయంత్రం 4 గంటలకు తిరిగి వెళ్తున్నామన్నారు. లింగాపూర్ స్టేజీ దాటిన అనంతరం మచ్చాపూర్ శివారులో ఆకస్మాత్తుగా అడవి దున్న తమ వాహనంపైకి దూకి రోడ్డు దాటిందని తెలిపారు. దీంతో తాము అదుపు తప్పి బైక్‌పై నుంచి కింద పడిపోయామన్నారు. కాగా, మంత్రుల పర్యటన సందర్భంగా బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు ఎన్‌హెచ్‌కు చెందిన అంబులెన్స్‌లో ఎక్కించి ములుగు దవాఖానకు పంపించారని తెలిపారు.

అడవి దున్నల నుంచి పంటను కాపాడాలి

మహాముత్తారం, ఆగస్టు 30: మండలంలోని ప్రేమ్‌నగర్ పరిధిలో పత్తి పంటను అడవిదున్నలు మేస్తున్నాయని, వాటి బారి నుంచి కాపాడాలని రైతులు వాపోతున్నారు. రాత్రి అయితే చాలు దున్నలు చేలల్లో మొక్కలు మేస్తూ పంటను ధ్వంసం చేస్తున్నాయన్నారు. ఈ విషయమై ఆజంనగర్ ఎఫ్ఆర్వోను సంప్రదించగా అధికారులను పంపించి నిర్ధారణ చేయిస్తామన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

గణపురం, ఆగస్టు 30: చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్సై రేఖ అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కర్కపల్లిలో మహారాజుల కాలనీ వద్ద ఆర్ఐ రహమత్ పాషా, పోలీస్‌ల ఆధ్వర్యంలో సంయుక్తంగా పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలు, అంటరానితనం, ఎస్సీ,ఎస్టీ చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు.

గుండెపోటుతో ఒకరు మృతి

గణపురం, ఆగస్టు 30 : మండలకేంద్రానికి చెందిన అంకం యుగంధర్ (42) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. యుగంధర్ ఓ పురుగు మందుల కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గణపురం నుంచి భూపాలపల్లిలోని ఓ డీలర్ వద్దకు వెళ్లి మాట్లాడి బ్యాంకుకు వెళ్దామని కారులో కూర్చున్నాడు. అప్పటికే డ్రైవర్‌తో గుండె నొప్పి వస్తున్నదని చెప్పి కుప్పకూలాడు. వెంటనే డ్రైవర్ వంద పడకల ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే యుగంధర్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులున్నారు.

వాజేడులో దిగబడిన ఆర్టీసీ బస్సు

చీకట్లో ఇబ్బందులు పడిన ప్రయాణికులు
కొంగాల బ్రిడ్జి సమీపంలో ఘటన

బురదలో దిగబడిన ఆర్టీసీ బస్సు, చీకట్లో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

వాజేడు, ఆగస్టు 30 : వాజేడు మండలం కొంగాల బ్రిడ్జి వద్ద ఆర్టీసీ బస్సు దిగబడింది. వివరాలిలా ఉన్నాయి.. వాజేడు మీదుగా గుమ్మిడిదొడ్డి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి రెండు బ్రిడ్జిలు నిర్మించిన కాంట్రాక్టర్ కొంగా బ్రిడ్జి ముందు భాగంలో రోడ్డు వేయకుండా మట్టి పోసి వదిలేశాడు. వర్షం పడడంతో రోడ్డు బురదగా మారింది. దీంతో వాజేడు వచ్చే వాహనాలు జగన్నాథపురం మీగుగా వస్తున్నాయి. ఈ క్రమంలో భద్రాచలం నుంచి వాజేడు మీదుగా పేరూరు వెళ్లే ఆర్టీసీ బస్సు శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో కొంగాల బ్రిడ్జి సమీపంలోని బురదలో దిగబడింది. డ్రైవర్ ఎంత ప్రయత్నం చేసినా బయటకు రాలేదు. దీంతో బస్సులోని సుమారు 30 మంది ప్రయాణికులు చీకట్లో బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్ స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చి ట్రాక్టర్ పంపించి బస్సును బయటకు తీయించినట్లు తెలిపారు.

స్వామి వారికి పూజా సామగ్రి తీసుకొస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర దంపతులు

పండుగలా పవిత్రోత్సవ వేడుకలు

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 30 : మంజూర్‌నగర్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న ప్రథమ వార్షికోత్సవ, పవిత్రోత్సవంలో శుక్రవారం శ్రావణ కృష్ణ ద్వాదశి పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద, అన్న ప్రసాద వితరణ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పెన్షన్ బకాయిలు వెంటనే చెల్లించాలి

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 30 : రిటైర్డ్ కార్మికులకు రావాల్సిన పెన్షన్ బకాయిలు వెంటనే అందజేయాలని సీఐటీయూ భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి అల్లి రాజేందర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కేటీకే-1 ఇంక్లైన్ గనిపై సెకండ్ షిఫ్ట్‌లో సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులతో సంతకాల సేకరణ చేపట్టారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గని మేనేజర్ ఎండీ యాసిన్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ వారం రోజులుగా ఆందోళనలు చేస్తున్నా యాజమాన్యం లాభాల ప్రకటన చేయకపోవడం సరికాదన్నారు. రిటైర్డ్ కార్మికులకు రావాల్సిన పెన్షన్ బకాయిలను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కంపేటి రాజయ్య, శ్రీకాంత్, నారాయణ, రాములు పాల్గొన్నారు.

కేటీకే-1 ఇంక్లైన్ గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

అడిషనల్ ఎస్పీని కలిసిన జర్నలిస్టులు

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 30 : అడిషనల్ ఎస్పీగా బోనాల కిషన్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుక్రవారం భూపాలపల్లి కాకతీయ ప్రెస్‌క్లబ్ జర్నలిస్టులు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ పోలీసులు, జర్నలిస్టులు ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఎడ్ల సంతోష్, సామంతుల శ్యామ్, జల్లి రమేశ్, సామల శ్రీనివాస్, గుమ్మడి రవీందర్, బండ మోహన్, కడపాక రవి, బొట్ల వివేకానంద, సృజన్, దేవేందర్ పాల్గొన్నారు.

కుల గణనలో దివ్యాంగుల లెక్క తీయాలి

గణపురం, ఆగస్టు 30 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుల గణన చేపడుతున్న నేపథ్యంలో దివ్యాంగులను ప్రత్యేకంగా లెక్కించి స్థానిక సంస్థల ఎన్నికల్లో 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు భూక్యా హరిలాల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2016 దివ్యాంగుల హక్కుల చట్టం అమలు తర్వాత 21 రకాల దివ్యాంగుల లెక్కలు ఎక్కడా లెక్కించలేదన్నారు. 2011 లెక్కల్లో 1995 చట్టం ప్రకారం ఏడు రకాలనే లెక్కించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అందరిని లెక్కించి రిజర్వేషన్ వర్తింపజేయాలని కోరారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

కాళేశ్వరం,(మహదేవపూర్) ఆగస్టు 30 : మహదేవపూర్ మండలం సూరారం గ్రామంలో పేకాడుతున్న తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్ తెలిపారు. పక్కా సమాచారంతో ఎస్సీ కాలనీలోని పుల్యాల మల్లయ్య ఇంట్లో పేకాడుతున్న వారిని పట్టుకొని రూ.1,610 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

సెప్టెంబర్ 1ని పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలి

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 30 : సెప్టెంబర్ 1ని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలపాలని జేఏసీ చైర్మన్ బూర్గు రవి అన్నారు. శుక్రవారం టీఎన్‌జీవోస్ కార్యాలయంలో తెలంగాణ ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ భాగస్వామ్య సంఘాల ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించగా రవి మాట్లాడారు. టీజీ జేఏసీ భాగస్వామ్య సంఘాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ర్యాలీకి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయ